## తడి,పొడి చెత్తపై అవగాహన ఉండాలి

బోడుప్పల్: తడి, పొడి చెత్తపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. బోడుప్పల్‌లో 100 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం 10వ డివిజన్‌లో న్యూ హేమానగర్ కాలనీ, వెస్ట్ బాలాజీహిల్స్ కాలనీ, హేమానగర్‌లోని కాలనీవాసులకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. 3వ డివిజన్‌లో జేసీబీతో రోడ్డు పక్కన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ శైలజ మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త, చెదారం రోడ్లు, ఖాళీ స్థలాలు, ప్లాట్లల్లో చెత్త వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందజేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## హోంగార్డుకు చేయూత



హోంగార్డుకు నగదు అందజేస్తున్న ఏసీపీ చక్రపాణి

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న ఎం.యాదయ్యకు ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఎస్సైలు, సిబ్బంది చేయూతను అందించారు. ఇటీవల అనారోగ్యం కారణంగా యాదయ్య ఆస్పత్రిలో చేరి, శస్త్రచికిత్స చేయించుకున్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ చక్రపాణి చేతుల మీదుగా రూ. 45 వేల సాయం అందజేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సైలు గణేష్, శంకర్, ఉపేందర్, సునీల్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో ఆటపాటలతో విద్య



అల్వాల్: అల్వాల్ సెక్టార్ భరత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో స్వాతి ఆధ్వర్యంలో 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతో పిల్లల్లో శారీరక అభివృద్ధితో పాటు మానసిక అభివృద్ధి పెరుగుతుందన్నారు. సూపర్‌వైజర్ సుధాకీర్తి, బస్తీ దవాఖాన డాక్టర్ రూప, అంగన్‌వాడీ టీచర్ సుసెన్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

రామంతాపూర్: వర్షాకాలం నేపథ్యంలో డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలను పరిశుభ్రంగా ఉంచేందుకు శానిటేషన్ అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిబ్బందితో సిద్ధంగా ఉండాలని డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని శారదానగర్, ప్రగతినగర్‌లో జీహెచ్‌ఎంసీ నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాలను గుర్తించి వరదనీరు నిల్వ ఉండకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఇంజనీర్ చందన, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వెంకటరెడ్డి, మోహన్, బాలరాజ్, రాణప్రతాప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటిక సమస్యను పరిష్కరించండి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లోని హిందూ శ్మశానవాటిక సమస్యలపై కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ సోమవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన జెడ్సీ తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు.

## ఘనంగా వన మహోత్సవం



పీర్జాదిగూడలో మొక్కలు నాటుతున్న కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ గాయత్రినగర్ ఫేజ్–2లో వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు కాలనీల్లో విద్యార్థులు, కాలనీల ప్రజలతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెత్తను వేరుచేయడం, వీధికుక్కల నియంత్రణ, దోమల నియంత్రణ, సీజన్ వ్యాధులపై నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇంజనీర్ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాధుల కాలం..

# ఆరోగ్యం భద్రం!

- వాతావరణంలో మార్పులతో..
- విషజ్వరాలు సోకేందుకు అవకాశం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు

గౌతంనగర్: ఓ వైపు వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, మరో వైపు ఆడపాదడపా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాలకు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు, ఓపెన్ నాలాలు నిండి మురుగు బస్తీలు, కాలనీల్లో రోడ్లపై పారడంతో పాటు పరిసరాలల్లో మురుగు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, డయేరియా, విషజ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే



మిర్జాలగూడ రహదారి పక్కన మురుగు

దోమల వృద్ధిని అరికట్టవచ్చని చెబుతున్నారు.

### ఉచితంగా మందులు..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. డెంగీ నిర్ధారణ అయితే వెంటనే రక్త కణాల పరీక్షలు చేస్తున్నారు. ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్న రోగులకు రక్తం ప్లేట్‌లెట్స్ కోసం సిఫార్సు చేస్తున్నారు. ప్రజలు తమ ఇళ్లలో కొద్దిపాటి రక్షణ తీసుకుంటే వ్యాధుల భారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్య, మున్సిపల్ అధికారులు సూచిస్తున్నారు.

### ఫాగింగ్‌పై దృష్టి..

మరోవైపు దోమల నివారణ కోసం మల్కాజిగిరి సర్కిల్ ఎంటమాలజీ విభాగం అధికారులు ఫాగింగ్‌పై దృష్టి సారించారు. ఫాగింగ్ యంత్రాలను సిద్ధం చేసుకుని కాలనీలలో ఫాగింగ్ చేస్తున్నారు. దోమలు ఎక్కువగా ఉన్న కాలనీల్లో ఫాగింగ్‌కు తగిన చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి సర్కిల్ ఎంటమాలజీ అధికారిని వనజ తెలిపారు. అంతేకాకుండా నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంటమాలజీ అధికారులు సూచిస్తున్నారు.

### నాలాల్లో పూడికతీత పనులు..

మరోవైపు జలమండలి, మున్సిపల్ అధికారులు సమన్వయంతో నాలాల్లో వ్యర్థాలతో పాటు పూడికతీత పనులు చేపట్టారు. ప్రస్తుతం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నాలాల పూడికతీత పనులు కొనసాగుతున్నాయి.



గౌతంనగర్‌లో ఫాగింగ్ చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

### వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వాతావరణంలో మర్పుల కారణంగా సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. విషజ్వరాలు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. తీవ్రమైన జ్వరంతో పాటు ఇతర లక్షణాలు ఉంటే స్థానిక ఆసుపత్రిలో వైద్యుల సలహాలు తీసుకోవాలి. పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందిస్తున్నాం.

– రాధ, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఆర్‌కేనగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మరమ్మతుల కారణంగా ఆర్‌కేనగర్, చాణక్యపురి, వెస్ట్ ఆనంద్‌బాగ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాప్రా..

విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో మంగళవారం సైనిక్‌పురి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఈశ్వరపురి ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భాస్కర్‌రావునగర్, ఎస్‌బీఓ కాలనీ, మాధవపురి, ఓయూటీ కాలనీ, ఈశ్వరపురిలో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. ఎల్లారెడ్డిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హనుమాన్‌నగర్, ఎస్‌ఆర్‌ఐ కాలనీ, ఆర్టీసీ కాలనీ, శ్రీసాయినగర్, వినాయక్‌నగర్, సాయిసుమా ఎన్‌క్లేవ్‌లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## స్కేటింగ్‌లో విద్యార్థి ప్రతిభ

బోడుప్పల్: పీర్జాదిగూడలోని డెకథ్లాన్ నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో బోడుప్పల్‌కు చెందిన భూక్యా సుప్రతిక్ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా సుప్రతిక్ మాట్లాడుతూ.. చదువుతో పాటు స్కేటింగ్‌ను రోజూ ప్రాక్టీస్ చేస్తున్నట్లు పేర్కొన్నాడు.

# కేటీఆర్‌కు ఎమ్మెల్యే సంఘీభావం



కేటీఆర్‌తో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ఫార్ములా ఈ– రేసింగ్ కేసులో ఏసీబీ విచారణకు హాజరైన కేటీఆర్‌కు సంఘీభావంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ర్యాలీగా తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. సోమవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫార్ములా ఈ– రేసింగ్‌ను తెలంగాణకు తీసుకొచ్చి రాష్ట్ర ప్రతిష్టను కేటీఆర్ పెంచారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి కేసులు, విచారణతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకన్న, జగదీష్‌గౌడ్, అనిల్‌కిషోర్, పరశురామిరెడ్డి, రావుల అంజయ్య తదితరులున్నారు.



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో బీఆర్‌ఎస్ నాయకులు

### బీఆర్‌ఎస్ భవన్‌కు స్థానిక నేతలు

గౌతంనగర్: ఫార్ములా–ఈ కేసులో విచారణకు హాజరుకావాలని ఏసీబీ అధికారులు మాజీమంత్రి కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడంతో తెలంగాణ భవన్ నుంచి విచారణకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి కేటీఆర్‌కు మద్దతుగా గౌతంనగర్ డివిజన్ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. నాయకులు మేకల రాముయాదవ్, బైరు అనిల్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, బిక్షపతి, శ్రీరాములుయాదవ్, శ్రీను, నర్సింగ్, నరహరిరావు, సూర్యప్రకాష్, కృష్ణయాదవ్, సతీష్, రాజా, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి



గ్రేటర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అల్వాల్ కొత్త చెరువు, సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్‌పై తెలంగాణకు చెందిన మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. క్యాంప్ ఆఫీస్‌కు కార్యాలయం కేటాయించాలని, మచ్చబొల్లారం డివిజన్ రైల్వేబజార్ రైల్వేస్టేషన్ సమీపంలో టన్నెల్ విస్తరణకు నిధులు కేటాయించాలని కోరానన్నారు. వివిధ డివిజన్ల వార్డు ఆఫీస్‌లు ప్రజలు ఉపయోగించుకోవడానికి, అల్వాల్‌లో ఫైర్‌స్టేషన్, మల్కాజిగిరి ఆర్‌కేనగర్‌లో సబ్‌స్టేషన్, బండచెరువు నుంచి వచ్చే వరదనీరు జెట్టీసీ క్రాస్‌రోడ్స్ మీదుగా లాలాపేటకు తరలించడానికి నిర్మాణం చేపట్టాలని కోరానన్నారు. దీనిపై గ్రేటర్ కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ ప్రతినిధులు

మౌలాలి: మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆపరేషన్‌కగార్‌కు వ్యతిరేకంగా ఈనెల 17న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ.. వినాయక్‌నగర్ సీపీఐ కార్యాలయంలో సోమవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీపీఐ మహిళా సమైక్య ప్రతినిధి రొయ్యల గిరిజాకృష్ణమూర్తి, నాయకులు ప్రభాకర్, యాదగిరి, అజీజ్, వెంకటరమణ, సయ్యద్, యూసఫ్, భూమయ్య, కమలమ్మలు పాల్గొన్నారు.

# 'ప్రధాని హయాంలో దేశం సుసంపన్నం'

అల్వాల్: ప్రధాని మోదీ పాలనలోనే దేశం సుసంపన్నమైందని, రైతులను రాజుగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రారంభించిన 11 ఏళ్ల వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమాన్ని సోమవారం మచ్చబొల్లారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 ఏళ్ల సేవ, సుశాసన,గరీబ్ కల్యాణ్ యాత్ర భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమం ఉద్దేశమన్నారు. నియోజకవర్గ కో–కన్వీనర్ మల్లిఖార్జున్‌గౌడ్, దండుగుల వెంకటేష్, అజయ్‌రెడ్డి, పద్మిని, ప్రసన్న, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్‌గౌడ్

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేయదలుచుకునే విద్యార్థులు అప్లయ్ చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.విజయకుమార్ తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఇప్పటి వరకు దోస్త్ ద్వారా డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోనివారు.. జూన్ 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంపీసీ,బీజెడ్సీ తదితర కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## నూతన మంత్రికి సత్కారం



మంత్రి గడ్డం వివేక్‌తో మాజీ కార్పొరేటర్

బోడుప్పల్: నూతన మంత్రిగా రాష్ట్ర కేబినెట్‌లోకి అడుగు పెట్టిన మంత్రి గడ్డం వివేక్‌ను ఆయన నివాసంలో బోడుప్పల్ 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్‌కుమార్ కలిశారు. ఆయన నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసి పూలమాలలు వేసి సత్కరించారు. యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు అరవింద్, రాహుల్ తదితరులున్నారు.

## కేంద్రమంత్రి పరామర్శ



మల్కాజిగిరి: దాడి కేసులో గాయపడిన మల్కాజిగిరి బీజేఆర్‌నగర్‌కు చెందిన గోరక్షక్ వంశీకృష్ణ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించారు. బీజేపీ సీనియర్ నేత నాగరాజును దాడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూపరింటెండెంట్‌కు కేంద్రమంత్రి సూచించారు.

## 'మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలి'

ఐద్వా మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సృజన

మేడిపల్లి : మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బెల్టుషాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.సృజన ఎక్సైజ్ అధికారులు, మేడిపల్లి పోలీసులను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బెల్టు షాపుల కారణంగా అనేక కాలనీల్లో గొడవలు, పలు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కాలనీల్లో మద్యం లభించడంతో పలు కుటుంబాలు చితికి పోతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు బెల్టు షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆర్థిక చేయూత

మేడ్చల్‌రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన ఉద్యోగి కుటుంబానికి జీవీకేఈఎంఆర్‌ఐ సంస్థ అండగా నిలిచింది. జీవీకేఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థలో 104 ప్రాజెక్ట్‌లో హైదరాబాద్ జిల్లా హెల్త్ అడ్వైజరీగా విధులు నిర్వహించే శైలజ మోహన్ గత ఏప్రిల్ నెలలో అనారోగ్య కారణాలతో మృతి చెందింది. ఈ మేరకు సోమవారం సంస్థ స్టేట్ హెడ్ సుధాకర్ గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కార్యాలయంలో ఆమె కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. స్టేట్ హెచ్‌ఆర్ హెడ్ కిరణ్ కిశోర్ తదితరులున్నారు.

# ప్రజావాణిలో శానిటేషన్‌పై ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో శానిటేషన్‌పై ప్రజలు ఫిర్యాదులు చేశారు. కార్పొరేటర్ శ్రవణ్ కాలనీల్లో శానిటేషన్ అధ్వానంగా ఉందని, వారానికి ఓసారి కూడా శుభ్రం చేయడం లేదని డీసీకి సోమవారం ఫిర్యాదు చేశారు. స్వీపింగ్ మిషన్లు కనిపించడం లేదని, ఓల్డ్ నేరెడ్‌మెట్‌లో శానిటేషన్ సిబ్బందిపై ఏఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేసినా.. తగిన చర్యలు తీసుకోలేదన్నారు.

- సఫిల్‌గూడ చెరువులో తొలగించిన గుర్రపుడెక్కను తొలగించే వారు కరువయ్యారన్నారు. మాన్‌సూన్ స్పెషల్‌డ్రైవ్ నత్తనడకన నడుస్తుందని, విద్యుత్ జలమండలి అధికారులు పాల్గొనాలని, ప్రత్యేక వాహనాలు ఉండాలని గ్రేటర్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చినా.. పాటించకపోవడాన్ని ప్రశ్నించారు. మల్కాజిగిరి శానిటేషన్ విభాగం అధికారుల తీరుపై కమిషనర్, అడిషనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

# దోమల నివారణకు తగిన చర్యలు



ఎస్‌ఈ మాధవరెడ్డితో నాచారం కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో దోమల సమస్యను పరిష్కరించాలని ఎల్బీనగర్ జోన్ ఎంటమాలజీ ఎస్‌ఈ మాధవరెడ్డిని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ కోరారు. సోమవారం నాచారం కార్పొరేటర్‌తో ఎస్‌ఈ మర్యాదపూర్వకంగా కలిశారు. నాచారం పటేల్‌కుంట చెరువులోని గుర్రపుడెక్కతో దోమల సమస్య పెరిగిపోయిందని ఎస్‌ఈతో పేర్కొన్నారు. చెరువులోని గుర్రపుడెక్కను తొలగించాలన్నారు. ఎఫ్‌టీసీ యంత్రం సాయంతో చెరువులోని గుర్రపు డెక్కను తొలగించాలని అడిషనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని ఎఫ్‌టీసీ యంత్రాన్ని పంపిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎంటమాలజీ ఏఈ రమేష్, సూపర్‌వైజర్ నరసింహ, తదితరులున్నారు.

# డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలి

కుషాయిగూడ: శానిటేషన్ సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పనిచేసి డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం చర్లపల్లి డివిజన్‌లో ఏర్పాటు చేసిన శానిటేషన్ డ్రైవ్‌ను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత శానిటేషన్ సిబ్బందిపై ఉందన్నారు. ఆ దిశగా కార్యచరణ చేసి డివిజన్‌లో శానిటేషన్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాప్రా సర్కిల్ మెడికల్ ఆఫీసర్ మధుసూదన్, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, యూజీడీ సూపర్‌వైజర్ నరేష్, రాంకీ ప్రతినిధులు నవీన్‌రెడ్డి, అనిల్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

## గంజాయితో పట్టుపడ్డ వ్యక్తి రిమాండ్

మేడిపల్లి: నిషేధిత గంజాయితో పట్టుపడ్డ ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మేడిపల్లి పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ పోలీసులు పెట్రోలింగ్ చేసుండగా కోల్‌కత్తాకు చెందిన మహమ్మద్ అదీల్ (36) హనుమాన్ నగర్ కాలనీలో అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోనికి తీసుకుని విచారించగా 30 గ్రాముల గంజాయి ప్యాకెట్ లభించింది. స్వాధీనం చేసుకొని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు ఈ మేరకు రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# బాలికల హాస్టల్ భవనం మార్చాలని ధర్నా

రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్‌లో ఉన్న గిరిజన బాలికల వసతి గృహం భవనం కనీస సౌకర్యాలు లేవని, అన్ని సౌకర్యాలు ఉన్న భవనంలోకి హాస్టల్‌ను మార్చాలని సోమవారం హాస్టల్ ఎదుట జాతీయ బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సేవా సంఘం కోశాధికారి బట్టు వెంకన్న మాట్లాడుతూ.. నగరంలోని వివిధ పబ్లిక్ కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న గిరిజన బాలికల కోసం ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ కాంట్రాక్టర్ల ద్వారా వసతి గృహాలు నిర్వహిస్తుందని అన్నారు. గిరిజన సంక్షేమశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కనీస సౌకర్యాలు లేని పురాతన భవనంలో బాలికల వసతి గృహం నిర్వహిస్తున్నారని, ఈ వసతిగృహంలో బాత్‌రూమ్ ఇతర గదుల్లో నీళ్ల సదుపాయం లేకపోవడం, విద్యార్థులకు నిబంధనల ప్రకారం ప్రతిరోజు ట్యూషన్ చెప్పాల్సిన ట్యూషన్ చెప్పకపోవడం, అధికారులు బాలికల వసతి గృహం భవనానికి మార్చాలని లేదంటే ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని వారు హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు శంకర్‌నాయక్, నందు, చందులాల్, భూక్య వెంకన్న రాజు, హత్యానాయక్, లక్ష్మయ్య, స్వప్న, పుష్పలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన బాలికల వసతి గృహం ఎదుట . ధర్నా చేస్తున్న దృశ్యం